# 12

## వసుంధర విశ్వాసం

మహిళామణుల కళాశాల అది. ప్రిన్సిపాలు, డాక్టరు సావిత్రీ నటరాజన్, ఎం. ఏ. (ఆక్సన్), పి. హెచ్‌డీ. తన ఆఫీసు రూములో కూర్చుని, హిందీ లెక్చెరరు ఉద్యోగానికని వచ్చిన దరఖాస్తులన్నీ పరిశీలిస్తోంది.

హిందీ రాజభాష కావటంతోనే దానికి ప్రాముఖ్యత ఎక్కువై, ప్రతి పాఠశాలలోనూ, కళాశాలలోనూ పండితులూ, లెక్చరర్లూ ఒక్కమాటుగా కావలసి వచ్చారు. డిమాండు కన్న సప్లై తక్కువ కావటంవల్ల చాలా విద్యా సంస్థలు సరియైన హిందీవాలాలు దొరకక తికమకలు పడవలసి వచ్చింది. తన కాలేజీలో తక్కిన ఉద్యోగాలన్నింటికీ ప్రచురణ లేకుం

డానే మనుషుల్ని సంపాదించ గలిగిందిగాని, ఈ హిందీ పోస్టుకిమాత్రం సావిత్రీ నటరాజన్‌గారు, అనగా నట రాజన్‌గారి సతీమణి ఐన సావిత్రిగారు ఎడ్వర్టయిజు చెయ్యక తప్పిందిగాదు.

ఎడ్వర్టయిజుమెంటుకు సమాధానంగా చాలానే వచ్చాయి దరఖాస్తులు. వాటినే ఇప్పు డామె పరిశీలిస్తోంది. సుందరేశ ముదల్యారూ, వేదాంత దేశికర్, గోపాలమీనన్, కుట్టిక్రిష్ణ నంబియార్, నారాయణ ఆప్టే, గోవర్ధన నింబ్‌కర్– వీళ్ళ దరఖాస్తులన్నీ ఆమె చదవకుండానే క్రింద సంతకం మాత్రం చూసి పెదిమి విరిచి పక్క ట్రేలో పారేసింది. ఆవిడ పెర్సనల్ అసిస్టెంటు, స్టెల్లా జోసెఫ్——జోసెఫ్‌గారి సతీమణి అన్నమాట, తర్వాతి అప్లికేషను అందించింది. అది శంభుదాస్ దాల్మియా అనేవాడి సంతకంతో వచ్చిన దర ఖాస్తు. ఆ సంతకం కూడా చూడ్డంతోనే సావిత్రీ నటరాజను ప్రాణం విసిగి 'ఛస్' అని విసిరికొట్టింది. స్టెల్లా అదిరిపడి, 'ఏమిటి చెప్మా!' అని బెదురుచూపులతో నిలబడేటప్పటికి, "వీళ్లంతా మగవాళ్ళే! 'ఈ పోస్టుకు మగవాళ్లు దరఖాస్తు చెయ్యనక్కర్లేదు. స్త్రీలు మాత్రమే చెయ్యాలి' అని నువ్వు ఎడ్వర్టయిజుమెంటులో ఎందుకు రాయలేదు?" అని ప్రిన్సిపాలు గద్దించి అడిగింది. స్టెల్లా, ముసిముసి నవ్వులతో 'ఆడవాళ్ళ కాలేజీ గనక తాము అప్లైచెయ్యకూడదన్న సంగతి మగవా ళ్ళకి తెలియకపోతుందా అని ఆమాట రాయలేదు మేడమ్' అని సర్దేసింది. "ఎందుకూ, మీరు ప్రతీదీ చూస్తో టైమ్

వేస్టుచేసుకోకండి. స్త్రీల దరఖాస్తులేవో నాలుగూ తీసి పైన పెడతాను. అవిమాత్రం చూద్దురుగాని'' అని, అధికారిణిని సమాధానపరిచి, స్టెల్లా స్త్రీల దరఖాస్తులకోసం అన్వేషణ ప్రారంభించింది.

ప్రారంభించిందేగాని కాస్సేపటికి స్టెల్లాకే ప్రాణం విసిగింది. శివశంకర పాండ్యా, విశ్వనాధపాధే, గౌరీపతిశాస్త్రి, గోపాలక్రిష్ణ గంధేకర్—ఏ దరఖాస్తు చూసినా వీళ్ళే! మగ వాళ్లు! స్త్రీల జనాభా ఎక్కువంటారుకాని ఉత్తిమాట. చూడాస్తే ఒక్కగాని ఒక్కటైనాలేదు స్త్రీ దరఖాస్తు! ఆమె విసుక్కుందేగాని, తనుకూడా ప్రిన్సిపాలుకుమల్లే ఆదరఖాస్తులు విసిరికొట్టడానికి వీల్లేదు గనక కొసవరకూ చూడక తప్పదని మళ్ళీ ఓపిగ్గా తిరగేసింది. అన్నీ పురుషుల దగ్గిర్నుంచే! ఇంకొక్కటే మిగిలింది. అదికూడా ఎవడో పురుషుడు పంపినదే ఐ ఉంటుంది. ఐనా చూద్దాం.

స్టెల్లా చూసింది. ఆమె కృషి ఫలించింది. 'కష్టే ఫలీ' అనీ, 'కృషితో నాస్తి దుర్భిక్షం' అనీ ఊరికే అన్నారా పెద్దలు! ఆ దరఖాస్తు స్త్రీదే! 'వసుంధరా విశ్వాసం' అని ఉంది వ్రాలు. 'విశ్వాసం'—విశ్వాసమన్నాయనను పెళ్లిచేసుకుందన్నమాట యీ వసుంధర. ఆ ఆలోచనతోబాటు స్టెల్లాకు మరో ఆలోచన వచ్చింది. ఈ దరఖాస్తు చేసినావిడ ఎవరో క్రిస్టియన్ ఐ ఉంటుంది. 'విశ్వాసం', 'సంతోషం', 'ఆనందం' ఇలాంటిపేర్లు క్రైస్తవులకే ఉంటాయి...ఇంత పెద్ద కాలేజీ అన్నమాటేగాని స్టాఫు అంతకీ తనొకర్తే క్రిస్టియను. ఈ

వసుంధర వస్తే ఎప్పుడైనా మాటా మంతీ ఆడుకోడానికి వీలుగా ఉంటుంది. క్వాలిఫికేషన్లు కాస్త తక్కువైనాసరే, ఈవిడకు ఉద్యోగం వేయించాలి.

ఆ నిశ్చయంతో స్టెల్లా, ఆ దరఖాస్తును ఆమూలా గ్రంగా చదివింది. క్వాలిఫికేషన్లు తక్కువేమిటి? విశారద, బి. ఓ. ఎల్., ఇంకా ఏమేవో ప్యాసయ్యానని ఉంది, ఆ దర ఖాస్తులో. ఇంక ఆలస్యమెందుకు? ఆలోచనెందుకు? ఆ కాగితం తీసుకెళ్లి ప్రిన్సిపాలుముందు పెట్టింది స్టెల్లా. సావిత్రీ నటరాజను అప్లికేషను పూర్తిగా చదివి, ఎడ్రస్సులో 'గుంటూరు' అని ఉండటం చూసి, 'తెలుంగు' అంది. "ఔను మేడమ్, తెలుంగు కనుకనే యీవిణ్ణి తప్పకుండా ఇప్పుడు అప్పాయింటు చెయ్యాలి, ఏమంటే, మన కాలేజీలో తెలుంగు లెక్చెరరు పిప్పకూడా అరవామెకు ఇస్తినని ఎంతో గోలగా ఉంది. తెలుగామె ఒక్కర్తే స్టాఫులో లేదన్నలోటు తీరిపోతుంది" అంది స్టెల్లా. ప్రిన్సిపాలు, స్టెల్లాకు తెలుగువాళ్ళంటే ఇంత అభిమానమెందుకు చెప్మా అని మనస్సులో అనుకుంటూ, "సరే. వచ్చి జాయిన్ కమ్మని వ్రాయి" అంది. "టెలిగ్రాం పంపుదాం మేడమ్. కాలేజీ తెరిచి ఇరవైరోజులైనా ఇంకా లెక్చరరు రాలేదని గోలచేస్తున్నారు పిల్లలు" అంది స్టెల్లా. 'సరే' నంది ప్రిన్సిపాలు.

తన అక్కకూతురికో, తన కూతురికో ఉద్యోగం వేయించుకుంటే వచ్చినంత సంబరంతో స్టెల్లా టెలిగ్రాం రాసి పట్టుకొచ్చి, ప్రిన్సిపాలుముందు అప్రూవలుకు పెట్టింది. 'శ్రీమతి

వసుంధరా విశ్వాసం' అని ఆరంభమైన చిరునామా చూచి ప్రిన్సిపాలు, "టెలిగ్రాములో మర్యాద అవసరంలేదు, స్టెల్లా. అణా తగ్గినా తగ్గటమే!" అంటూ 'శ్రీమతి' అన్నమాట కొట్టేసి, కాగితం తిరిగి ఇచ్చేసింది.

టెలిగ్రాం వెళ్లిన మూడోనాడు పదిగంటలకు మామూలుగా డాక్టర్ సావిత్రీ నటరాజన్ తనగదిలో కూర్చుని, స్టెల్లా తయారుచేసి యిచ్చిన టైమ్‌టేబిలు పరికిస్తోంది. బంట్రోతు చిన్న చీటీ ఒకటి తెచ్చి ఆమెముందు పెట్టేడు. 'వసుంధరా విశ్వాసం...' ఆల్‌రైట్, రమ్మను అన్నదామె. మరుక్షణంలో బిళ్ల పంచెకట్టూ, ఖద్దరు జుబ్బా, దానిమీద మడతవిప్పకుండా వేసుకున్న జరీఖండువాతో నల్లమీసాల యువకుడొకడు-ముప్ఫైయేళ్ళకు లోపువాడు - లోపల ప్రవేశించాడు. అతణ్ని చూడ్డంతోనే సావిత్రీ నటరాజన్ ఒక భూతాన్ని చూసినట్లుగా నిశ్చేష్టురాలైంది. కాని అతడు వసుంధరను వెంటబెట్టుకొచ్చిన మిస్టర్ విశ్వాసం అయుంటాడనుకొని, 'మిసెస్సును తీసుకొచ్చారా? లోనికి రమ్మనండి' అంది. ఆమాట విని, ఆ వచ్చినవాడు తెల్లబోయి, "నేను అవివాహితుణ్ని మేడమ్" అన్నాడు.

"అలాగైతే, వసుంధర ఎవరు? మీ సిస్టరా?"

"వసుంధర మా యింటిపేరు!"

"ఇంటిపేరా?"

"ఔను మేడమ్. నేను ఆంధ్రుణ్ని. ఆంధ్రులకు ఇంటిపే

ర్లుంటాయి కదండీ. మా యింటిపేరు వసుంధరవారు. నా పేరు విశ్వేశం."

ఆసమయానికి స్టెల్లా కాగితాలు పుచ్చుకుని అక్కడికొచ్చింది. ప్రిన్సిపాలు ఆమె కేసి చూస్తో, "నువ్వు టెలిగ్రాం పంపిన వసుంధరా విశ్వాసం ఈయనే!" అంది.

ఆ వచ్చినాతడు వెంటనే, "వసుంధరా విశ్వాసం కాదు మేడమ్, వసుంధర విశ్వేశం. విశ్వేశం అంటే విశ్వానికి ఈశం అన్నమాట. Lord of the Universe అని అర్థం వచ్చే పేరది" అన్నాడు.

స్టెల్లా కేమనాలో తోచిందికాదు. తప్పంతా తనదే నని చెప్పి, ప్రిన్సిపాలు తనమీద విరుచుకుపడుతుంది. ఆ పని జరక్క-పూర్వమే తప్పు కాస్తా ఆ వచ్చినవాడిమీదకు తోసేసి బయటపడాలి. "ఏమండీ విశ్వాసంగారూ..."

"విశ్వాసంకాదు మేడమ్! విశ్వేశం."

"సరే; Damn it, మీపేరేదైతేనేం? మమ్మల్ని మీరు మోసగిస్త మీ యింటిపేరుతో."

"మోసమా మేడమ్? మోసమేముందిందులో?"

"ఆడవాళ్ళ కాలేజీలో ఉద్యోగమని తెలుసుండీ అసలు మీ రెందుకు దరఖాస్తు చెయ్యాలి?"

"కొత్త కాంస్టిట్యూషను ప్రకారం మీ కాలేజీ కూడా జాతి మత లింగభేదాలు పాటించటం లేదేమో అనుకున్నాను మేడమ్. ఏమంటే మీ ఎడ్వర్టయిజుమెంటులో 'పురుషులు దరఖాస్తు చెయ్యకూడదు' అని లేదు."

స్టెల్లాదృష్టి ప్రిన్సిపాలుముఖంమీద అప్రయత్నంగా పడింది. ఇతడు చెప్పినది సబబుగానే ఉంది. అడ్వర్టయిజుమెంటులో ఆ విషయం సూచించకపోవటం నీదే తప్పు అన్న భావం ప్రిన్సిపాలు మొఖంలో స్టెల్లాకి తెల్లమైంది. ఐతేం? ఓ పట్టాన్ని ఓటమి ఒప్పుకునేదిగాదు స్టెల్లా. విశ్వేశంతో, "మీ యింటిపేరు మాకు మిమ్మల్ని గురించి వేరే అభిప్రాయం కలిగించింది. దరఖాస్తులో 'నేను పురుషుణ్ణి' అని రాసేస్తే తీరిపోను. అధమం సంతకంలోనైనా ఏ 'మిస్టర్' అనో సూచిస్తే మీ సంగతి తెలిసిపోను!" అన్నది.

విశ్వేశానికి కొంచెం కోపం వచ్చింది. "అమ్మా, నా యింటిపేరుతో మిమ్మల్ని మోసంచేద్దామన్న ఉద్దేశం నాకెన్నడూ లేదు. ఏమంటే నన్ను చూడ్డంతోనే, నేనెవర్నో తెలిసిపోయింది చూడండీ మీకు? అంచేత దరఖాస్తులో మిమ్మల్ని దగాచేసి ఏంలాభం? ఇంక, సంతకంలో నేను 'మిస్టర్' అని చేస్తే తీరిపోనన్నారు. అలా సంతకాలు చెయ్యటం నేను ఇదివరలో వినలేదు. ఇంకా పోనీ మీరే ఒక పని చేస్తే తీరిపోను. నాకుపంపిన టెలిగ్రాములో ఏ 'మిసెస్సో', 'శ్రీమతో' ముందు చేర్చివుంటే, జరిగిన పొరబాటు గ్రహించి, వెంటనే 'అమ్మా, నేను జుబ్బావాడినిగాని, జాకెట్టుదానను గాను' అని మనవిచేసుకునేవాణ్ణి" అన్నాడు.

ఆమాట వినటంతోనే స్టెల్లాకి ప్రిన్సిపాలుముఖం కేసి ఒక్కమాటు చూడాలనిపించింది. తాను 'శ్రీమతి' అని రాస్తే-

ఈవిడ అణాఖర్చు తగ్గించాలని ఆ ముక్క కొట్టేసి, వ్యవహారం ఇంతవరకూ తెచ్చింది! ఇప్పుడేమంటుందో!

కాస్సే పంతా నిశ్శబ్దం. ఆఖరికి ప్రిన్సిపాలే మాట్లాడింది. "మిస్టర్ విశ్వేశం, . జరిగిన పొరబాటేదో జరిగిపోయింది. మిమ్మల్ని ఇక్కడ అప్పాయింటు చెయ్యటానికి రూల్సు పర్మిట్ చెయ్యవు. మరోచోట ట్రై చెయ్యండి."

"సరే మేడమ్. నాదొక్క మనవి ఆలకించండి. ఉద్యోగమైందిఅన్న సంబరంకొద్దీ,మామూలుగా థర్డుక్లాసులో వచ్చేవాణ్ని, సెకండ్ క్లాసు టిక్కెట్టు కొనుక్కుని ప్రయాణం చేశాను. నాకీ ప్రయాణపుఖర్చులు ఇప్పిస్తే, ఈ వ్యవహారంలో నాకు నష్టంలేకుండా చేసినవారౌతారు."

ప్రిన్సిపాలు స్టెల్లాకేసి చూసి, "టి. ఏ. ఇవ్వటానికి రూల్సు వప్పుతాయా?" అంది. "ఒప్పవు మేడమ్" అంది స్టెల్లా. మళ్ళీ ఒకక్షణం నిశ్శబ్దం. స్టెల్లా విశ్వేశంతో, "మిస్టర్, మీరు విజిటర్సురూములో ఉండండి ఒక్కనిముషం" అంది. విశ్వేశం ఆ గది విడిచి వెళ్ళేడు. స్టెల్లా ప్రిన్సిపాలుతో, "మేడమ్, టి. ఏ. ఇవ్వటానికి రూల్సు వప్పవ్; అప్పాయింటు చెయ్యటానికీ రూల్స్ వప్పవ్. ఏదో ఒకటిమాత్రం చెయ్యాలి. మనకి అర్జంటుగా లెక్చరరు కావాలిగనుకా, ఆడవాళ్ళ దరఖాస్తు ఏదీ లేదు గనుకా, ఇతణ్ని అప్పాయింటు చేసేస్తే, అన్ని సమస్యలూ తీరిపోతాయి. టెంపొరరీగా ఒక యేడాదికి వేద్దాం. మళ్ళీయేడు ఆడదివస్తే చూసుకోవచ్చు" అంది. ప్రిన్సిపాల్ 'ఆల్ రైట్' అంది.

విజిటర్సురూములో కూచున్న విశ్వేశంతో స్టెల్లా, "మిస్టర్ విశ్వాసం, ఉద్యోగం అయింది" అంది.

"థాంక్స్ మేడమ్; మీరింకా నన్ను విశ్వాసం అనే అంటున్నారు. దానికేంగాని టి. ఏ. ఇవ్వటానికి రూల్సు వప్పవని నాకు ఉద్యోగం ఎలా ఇప్పించారు?"

"ఎవరు ఇప్పిస్త? మీ 'వసుంధర' ఇప్పించింది. వచ్చి మేకులా కూచున్నావు. పొమ్మనలేక నౌకరీ ఇచ్చింది ప్రిన్సిపాలు. అదృష్టం అంటే నీదయ్యా, విశ్వాసం. మగవాళ్ళనే వేసుకోవాలంటే, ఆ దరఖాస్తులలో నీ తలదన్నిన క్వాలిఫికేషన్లున్న మగవాళ్లెందరో ఉన్నారు. ఐతేం? నీకా 'వసుంధరే' పెద్ద క్వాలిఫికేషను ఐ ఇప్పించింది... వెళ్లు, 'సి' బ్లాకులో 3 వ గదిలో ఫష్టియరు క్లాసుంటుంది. తీసుకో" అని, అతడేదో చెప్పబోతూంటే వినిపించుకోక తరిమింది.